

ఎల్‌ఎహెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

దసరా సెలవులకు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ జిల్లా ప్రజలకు సూచించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా ఇంటికి అదనపు రక్షణ కల్పించనున్నట్లు చెప్పారు. దసరా, దీపావళి పండుగలకు కుటుంబ సభ్యులతో ఇంటికి తాళం వేసి వెళ్లేవారు ముందుగా సంబంధిత పోలీసులకు సమాచారం ఇస్తే ఆ ఇంట్లో ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాను ఏర్పాటు చేస్తారన్నారు. ఎవరైనా ఆ ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే పోలీసులకు సమాచారం అందుతుందని, పోలీసులు అక్కడకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకుంటారని తెలిపారు. ప్రజలు ఇంటికి తాళం వేసి ఎక్కడికి వెళ్లినా ఎల్‌హెచ్‌ఎంఎస్ ఉంటే పోలీసు పర్యవేక్షణ ఎప్పుడూ ఉంటుందన్నారు. ఉచితంగానే ఈ సేవలను అందిస్తామని ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

నేవీ ఆయుధ డిపో మాకొద్దు

జీలుగుమిల్లి మండలం మడకంవారిగూడెంలో కదంతొక్కిన గిరిజనులు

గిరిజనుల ర్యాలీపై విరుచుకుపడిన పోలీసులు, తీవ్ర ఉద్రిక్తత

పెద్దఎత్తున తోపులాట.. మహిళలను సైతం ఇష్టానుసారం తోసేసిన ఖాకీలు

అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన

ఏజెన్సీని మాయం చేస్తున్నారంటూ అడవి బిడ్డల ఆవేదన

కమీషన్ల కోసం ఎంపీ, ఎంఎల్ఏ తమను తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం

ఉద్యమం మరింత ఉధృతం చేస్తామన్న నేతలు



గిరిజన మహిళలను అడ్డుకుంటున్న మగ పోలీసులు



గిరిజనులను లాగేసే ప్రయత్నం చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జీలుగుమిల్లి

'నేవీ ఆయుధ డిపో మాకొద్దు' అంటూ గిరిజనులు మంగళవారం కదంతొక్కారు. అయితే గిరిజనుల ర్యాలీని పోలీసులు అడ్డుకుని బలప్రయోగం చేయడంతో జీలుగుమిల్లి మండలం మడకంవారిగూడెంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మడకంవారిగూడెం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ శాంతియుతంగా గిరిజనులు చేపట్టిన ర్యాలీని పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించి అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. గిరిజన మహిళలను, ప్రజాసంఘాల నాయకులను పోలీసులు బలవంతంగా మెడలు పట్టుకుని పక్కకు లాగేశారు. పోలీసుల వలయాన్ని ఛేదించుకుని ముందుకు సాగిన గిరిజనులను గ్రామశివార్లలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వందల సంఖ్యలో గ్రామస్తులు అక్కడే బైఠాయించి నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా నినదించారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని మడకంవారిగూడెం, దాట్లవారిగూడెం, వంకావారిగూడెం, రమణక్కపేట, కొత్తసీమలవారిగూడెం మొత్తం ఐదు గ్రామాల పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రభుత్వం పూనుకుంది. ఆయుధ డిపో కోసం 1,166 ఎకరాలు సేకరించడంతోపాటు ఆయా గ్రామాలను ఖాళీ చేయించేందుకు సిద్ధమైంది. గతంలో మూడుసార్లు గ్రామసభలో వ్యతిరేకంగా తీర్మానం చేసినప్పటికీ మళ్లీ నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రతిపాదించడాన్ని ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఐదు గ్రామాల ప్రజలు మడకంవారిగూడెం నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే సోమవారం నుంచి జీలుగుమిల్లి మండలంతోపాటు బుట్టాయగూడెం, టి.నరసాపురం మండలాల్లో పోలీసులు 30 యాక్ట్ అమలు చేసి తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. ప్రజాసంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు చేసేందుకు వేటాడారు. గిరిజనుల ర్యాలీని అడ్డుకునేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేశారు. పోలీసుల కంటపడకుండా వందలాది మంది గిరిజనులు మంగళవారం ఉదయం మడకంవారిగూడెం చేరుకున్నారు. అక్కడ నుంచి వారంతా ర్యాలీగా బయలుదేరగా పోలీసులు అడ్డుకుని తీవ్ర బలప్రయోగం చేశారు. పోలవరం డిఎస్‌పి ఆధ్వర్యంలో సిఐ, ఐదుగురు ఎస్ఐలు, పెద్దఎత్తున పోలీస్ సిబ్బంది గిరిజనులను ముందుకు సాగకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో గిరిజనులకు, పోలీసుల మధ్య పెద్దఎత్తున తోపులాట సాగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవిని పోలీసులు చుట్టుముట్టి పక్కకు తోసేశారు. గిరిజన నాయకులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్, తెల్లం దుర్గారావు, మడకం వెంకటేశ్వరరావుతోపాటు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ, గుడెల్లి వెంకట్రావు, కిరణ్, కారెం నాగదుర్గ, కారెం ధారయ్య, కారెం రాఘవ, తగరం బాబూరావు, కొండలరావు, తెల్లం సంకురుడు, బండి వెంకటేశ్వరరావుతోపాటు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొన్న గిరిజన మహిళలపై పోలీసులు విరుచుకుపడి ముందుకు సాగకుండా అడ్డుకున్నారు. దీంతో అంతా అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారంతా 'ఆయుధ డిపో మాకొద్దు, ఏజెన్సీని ఛిద్రం చేయొద్దు, మమ్మల్ని ఇలా బతకనీయండి, కమీషన్ల కోసం మా ఓట్లతో గెలిచిన ఎంపీ, ఎంఎల్ఏ కేంద్రానికి తమను తాకట్టు పెట్టొద్దు' అంటూ పెద్దఎత్తున నినదించారు.



మాట్లాడుతున్న గిరిజన నేత తెల్లం రామకృష్ణ

నేవీ ఆయుధ డిపో నిర్మిస్తే ఏజెన్సీ కనుమరుగు..
ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

రోడ్డుపై బైఠాయింపు సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ నేవీ ఆయుధ డిపో ఏర్పాటైతే ఏజెన్సీ అనేది కనుమరుగవుతుందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పేరుతో పలు గిరిజన గ్రామాలను ఖాళీ చేయించారన్నారు. జల్లేరు, పోగొండ జలాశయాల కోసం గిరిజనులు భూమి త్యాగం చేశారని గుర్తు చేశారు. అప్పట్లో ఇంటికో ఉద్యోగం, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వాలు, అధికారులు మాటలు చెప్పారని, భూములు సేకరించాక గిరిజనులను నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్లీ నేవీ ఆయుధ డిపో ఏర్పాటు అంటూ తమ భూములను లాక్కుని, ఇక్కడ గిరిజనులను తరిమికొట్టడానికి కుట్ర చేస్తున్నారన్నారు. ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వరావు, ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తెల్లం రామకృష్ణ, నేత తెల్లం దుర్గారావు, పలువురు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదన్నారు. పరిహారంగాని, ఇళ్లకు ఇళ్లుగాని, యువతకు పరిహారంగాని, భూమికి భూమి వంటి అనేక సమస్యలు అలానే ఉన్నాయని తెలిపారు. వీటిపై గిరిజనులకు అనుకూలంగా ఎంఎల్ఏగాని, ఎంపీగాని మాట్లాడిన దాఖలాలు లేవని విమర్శించారు. ఇప్పుడు పాలకులు ఏం చెబితే అదే అన్నట్లు పోలీసులు వ్యవహరించడం బాధాకరమని వాపోయారు. ఆయుధ డిపో పెట్టుకోవాలంటే ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయం పక్కన చాలాభూమి ఖాళీగా ఉందని, అక్కడ పెట్టుకోవచ్చని సూచించారు. లేదా మైదాన ప్రాంతంలో పెట్టుకోవచ్చన్నారు. ఒకవేళ ఇక్కడే పెట్టాలని అనుకుంటే మైదాన ప్రాంతంలో ఎకరానికి రెండు ఎకరాలు చొప్పున ఇచ్చి దాన్ని ఏజెన్సీగా నోటిఫై చేయాలని కోరారు. ఆయుధడిపోపై వెనక్కి తగ్గకపోతే ఉద్యమం ఆగదని, త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహించడంతోపాటు ఏజెన్సీలోని అన్ని మండలాలకు ఉద్యమాన్ని విస్తరిస్తామన్నారు..

తల్లి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుంది

మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్

కలెక్టర్ కె.వెట్రిసెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

తల్లి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబంతోపాటు సమాజం ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. తల్లి అనారోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ముందుకు పోయే పరిస్థితి ఉండదన్నారు. ఏలూరు మండలం జాలిపూడిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, పిహెచ్‌సిని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం 11 గంటల వరకు ఎంత మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారని ప్రశ్నించగా 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారులు కలెక్టర్‌కు తెలిపారు. వైద్యసేవలు, పరీక్షలు బాగా చేశారా, మందులు, వైద్య సలహాలు ఇచ్చారా అక్కడకొచ్చిన ప్రజలను కలెక్టర్ ప్రశ్నించగా చూశారని వారు సమాధానం ఇచ్చారు. గ్రామంలో గ్రౌండు వాటర్ బాగోలేదని చెప్పడంతో కలెక్టర్ వెనువెంటనే స్పందించి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. నీటి పరీక్షలు నిర్వహించి, గ్రామస్తులకు రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన స్త్రీ దేశానికి, రాష్ట్రానికి అవసరమని, వైద్యపరీక్షలు, సలహాల ద్వారా ఆరోగ్యవంత మహిళలుగా తీర్చిదిద్దేం దుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయన్నారు. తల్లి గర్భిణిగా ఉన్నప్పుడు మంచి పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యకర సంతానం కలుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు వేలాది కోట్లు వెచ్చించి పౌష్టికాహారం అందిస్తున్నదన్నారు. మహిళలు, కిశోర బాలికలకు స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, కేన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించడం, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ పరీక్షల నిర్వహణ, రిఫరల్ సేవలు అందిస్తారన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహణ, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు అందించడం, ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా సేవలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.విజయ కుమార్, వైద్యాధికారులు డాక్టర్ ఆర్.ఫణీం ద్రకుమార్, డాక్టర్ సిహెచ్.పూర్ణ శ్రీనివాస్, ఉపాధ్యా యులు, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

నెల రోజుల్లో ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్ పూర్తి
కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం

జిల్లాలో ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ లక్ష ఎకరాలు నెల రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ఏలూరు మండలం జాలిపూడిలో మంగళవారం ఆక్వా చెరువులను మత్స్యశాఖ అధికారులు సంబంధిత రైతులతో కలిసి పరిశీలించారు. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎపి ఆక్వా కల్చర్ అభివృద్ధి అథారిటీ యాక్ట్‌ను అనుసరించి జిల్లాలోని ఆక్వా చెరువుల వివరాలను నిర్దేశించిన సమయంలోగా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆయా గ్రామాల్లో టాంటాం వేసి, రైతులకు అవగాహనా సదస్సులు నిర్వహించాలని, రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో అధిక విస్తీర్ణంలో ఆక్వా చెరువులు కలిగిన కలిదిండి, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, నిడమర్రు తదితర మండలాల్లో ఆక్వా చెరువుల వివరాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 26,582 ఆక్వా చెరువులు ఉన్నాయని, వాటికి సంబంధించి చెరువు విస్తీర్ణం, యజమాని పేరు, ఆక్వా సాగు, వినియోగిస్తున్న ఎరువులు తదితర వివరాలను విలేజ్ ఆక్వాకల్చర్ యాప్‌లో ఇప్పటివరకు 20,900 ఎకరాలు నమోదు చేశారని, మిగిలినవి రెండు రోజుల్లో యాప్‌లో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డిడి బి.నర్సయ్య, తహశీల్దారు జి.విజయకుమార్, మండల మత్స్యశాఖ అధికారి ఎ.సతీష్‌కుమార్, మండల సర్వేయర్లు, ఫిషరీష్ సహాయకులు, రెవెన్యూ సిబ్బంది, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థులకు ప్రయాణ, వసతి సౌకర్యాలు

అధికారులకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 25న అమరావతిలో సిఎం చంద్రబాబు చేతుల మీదుగా నియామక పత్రాల స్వీకరణకు వెళ్లే డిఎస్‌సి అభ్యర్థులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చక్కని వసతి, రవాణా సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం మెగా డిఎస్‌సిలో ఎంపికైన అభ్యర్థులకు అమరావతికి ప్రయాణ ఏర్పాట్లపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెగా డిఎస్‌సిలో 1063 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని, జోనల్ పోస్టులకు సంబంధించి ఈ జిల్లా వాసులు 168 మంది ఉన్నారని, మొత్తం 1231 మంది అభ్యర్థులు ఈ నెల 25న అమరావతి వెళ్లాల్సి ఉందన్నారు. అభ్యర్థులతోపాటు మరో మనిషి తోడుగా ఉండేలా ఏలూరు నుండి అమరావతి తీసుకువెళ్లి, తిరిగి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏలూరులో వారు బస చేసేందుకు ఏర్పాట్లు చేయాలని, 24వ తేదీ రాత్రి భోజన సదుపాయం, 25వ తేదీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించి కార్యక్రమానికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమం పూర్తయ్యాక తిరిగి ఏలూరు తీసుకురావాలన్నారు. దీనికి అవసరమైన బస్సులు ఏర్పాటు చేయాలని, ప్రతి బస్సుకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. అభ్యర్థులు రిసీవింగ్ సెంటర్‌కు హాల్ టికెట్, కాల్ లెటర్, ఆధార్, ఫొటో తీసుకురావాలని, అభ్యర్థితోపాటు వచ్చే వ్యక్తులు ఆధార్ కార్డు, ఫొటో తీసుకురావాల్సి ఉంటుందని చెప్పారు. డిఇఒ వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ అభ్యర్థులు, వారితో పాటు వచ్చే కుటుంబ సభ్యుల పేర్లను బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ఏలూరులోని డిఇఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు బుధవారం రాత్రి ఏలూరులో బసకు సంబంధించి దుప్పట్లు, తదితర సామాన్లు తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఎస్ఎస్ఎ ఎపిఒ పంకజ్‌కుమార్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిఎంహెచ్ఒ డాక్టర్ పిజె.అమృతం, జిల్లా ప్రజారవాణాధికారి ఎస్‌కె.షబ్నం, డిఎస్‌పి శ్రావణ్ కుమార్, తహశీల్దార్ గాయత్రి పాల్గొన్నారు.

నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను నిలువరించలేరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ఏలూరులో నిరసన

జీలుగుమిల్లి మండలంలో ఆయుధ డిపో పేరుతో బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తున్న ప్రజలపై, ప్రజాసంఘాలపై పోలీసుల నిర్బంధాన్ని, దౌర్జన్యాన్ని నిరసిస్తూ వామపక్షాలు మంగళవారం ఏలూరు పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగాయి. సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు, సిపిఐ నాయకులు ఆళ్లగడ్డ విజయ మాట్లాడుతూ గ్రామ సభల నిర్ణయానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన ర్యాలీ చేస్తున్న జీలుగుమిల్లి మండల ప్రజానీకంపై పోలీసులతో దౌర్జన్యం చేయించడం, నిర్బంధం విధించడం సరికాదన్నారు. నిర్బంధాల ద్వారా ప్రజా ఉద్యమాలను, ప్రజాభిప్రాయాలను నిలువరించలేరన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డిఎన్‌విడి.ప్రసాద్, నగర కార్యదర్శి పంపన రవికుమార్, జె.గోపి, కడలి రామాంజనేయులు, వివివిఎన్.ప్రసాద్, న్యూ డెమోక్రసీ నాయ కులు యర్రా శ్రీనివాసరావు, పిన్నింటి త్రినాథ్, సిపిఐ నాయకులు మావూరి విజయ, పి.శంకర్, కనకారావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని సిపిఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. టౌన్ కన్వీనర్ పి.సూర్యారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ ధర్నాలో ఎం.జీవరత్నం మాట్లాడుతూ ప్రజల అభిప్రాయం మేరకు గ్రామ సభలు నిర్వహించి పీసా కమిటీల తీర్మాన ఆమోదం ప్రకారం ముందుకెళ్లాలనిచ లేకుంటే గత వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపినట్టే కూటమి ప్రభుత్వాన్ని కూడా గద్దె దించుతారని చెప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల పట్టణ కమిటీ సభ్యులు జోడే సూరిచంద్రరావు, అందుగుల ప్రభాకరరావు, ఎస్‌కె.సుభాషిణి, ఎస్‌కె.బాబు సుభాని, వంగా గోపీ, కె.సుబ్బారావు, ఎం.బాలరాజు, పి.ఘటోత్కచుడు, బి.రామకృష్ణ, డి.ఆశీర్వాదం, పి.సత్తిబాబు, కె.స్టాలిన్, రాంబాబు, సునీల్ పాల్గొన్నారు.

ముసునూరు : అక్రమ అరెస్టులను సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ ఖండించారు. ముసునూరులో ఆయన మాట్లాడుతూ దాడి, అక్రమ అరెస్టులు సరికాదన్నారు.

బుట్టాయగూడెం : ఆయుధ డిపోను ఏజెన్సీలో పెట్టొద్దని ఆదివాసీ గిరిజన సంఘాలు సిపిఎం, వామపక్ష పార్టీలు ధర్నాకు పిలుపు ఇవ్వటంతో అందుగల ఫ్రాన్సిస్‌ను సోమవారం అర్ధరాత్రి కానిస్టేబుల్ రెడ్డి గణపవరంలో హౌస్ అరెస్ట్ చేశారు.

మెడికల్ కాలేజీని ప్రయివేటుకు అప్పగిస్తే..

ఉద్యమమే..

పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన భీమవరం నుండి దగ్గులూరు మెడికల్ కాలేజీ వరకు బైక్ ర్యాలీ

నిర్మాణ దశలో ఉన్న మెడికల్ కాలేజీ కట్టడాల సందర్శన

ప్రజాశక్తి - భీమవరం

పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా, వైద్య రంగాన్ని మరింత ఖరీదుగా మార్చేలా మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో ప్రయివేటోళ్లకు అప్పగించేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం విరమించుకోవాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక అంబేద్కర్ చౌక్ నుండి దగ్గులూరు మెడికల్ కాలేజీ వరకూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెడికల్ కాలేజీ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలిపి పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ వైద్య విద్య ప్రభుత్వ రంగంలోనే ఉంటే ప్రజానీకానికి, రాష్ట్రాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. వైద్యరంగం ప్రభుత్వ అధీనంలో ఉన్న అనేక దేశాల్లో వైద్య సదుపాయాలు ప్రజలకు ఎలా అందించబడుతున్నాయో, కార్పొరేట్లపరమైతే ప్రజలకు ఎలా ఖరీదుగా మారుతున్నాయో కరోనా సమయంలో మనందరికీ తెలిసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పిపిపి విధానాన్ని తక్షణం విరమించుకోవాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రయివేటుపరమైతే పేద విద్యార్థులు వైద్యవిద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరించడాన్ని నిరసిస్తూ పెద్దఎత్తున ఉద్యమాలకు ఎస్ఎఫ్ఐ సిద్ధపడుతోందన్నారు. గత ప్రభుత్వం దోచుకుందని చెబుతున్న కూటమి ప్రభుత్వం, నేడు మెడికల్ కాలేజీలను అమ్మేసి ఎంత దోచుకుంటుందని ప్రశ్నించారు. తక్షణం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు లంకా కృష్ణమూర్తి, ఎంసిపిఐ(యు) నాయకులు కె.మహంకాళి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు 590 జిఒ జారీ చేసి మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరిస్తున్నారన్నారు. దీనివల్ల పేద విద్యార్థి తన లక్ష్యాన్ని ఎలా చేరుకుంటారని ప్రశ్నించారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈద శేఖర్‌బాబు మాట్లాడుతూ దేశ సంపదను దోచుకున్న బ్రిటిష్ వాళ్లే విద్య, వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంపదను దోచుకుంటూ విద్య, వైద్యాన్ని వ్యాపారం చేసి కార్పొరేట్లకు అప్పగిస్తోందని మండిపడ్డారు. మెడికల్ కాలేజీ ప్రయివేటీకరణను అడ్డుకునే వరకు ఎంత పెద్దస్థాయి ఉద్యమానికైనా ప్రజలంతా ఐక్యంగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యం అత్యంత ఖరీదైన వ్యాపారంగా మార్చి ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్, ఎపి సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పెంద్ర వీరన్న మాట్లాడుతూ పేదలకు ఉపయోగపడే సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వడాన్ని అందరూ వ్యతిరేకించాలన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీ నిర్వహణ నుంచి ప్రభుత్వం తప్పుకుని ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వడం అంటే అతిపెద్ద అవినీతే అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తే రాజ్‌కుమార్, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ అధ్యక్షుడు సూడదాసు గంగయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, ఐలు జిల్లా నాయకులు రామాని కాస్ట్రో, జెవివి జిల్లా నాయకులు మల్లుల శ్రీనివాస్, రిటైర్డ్ మెడికల్ అండ్ హెల్త్ అధికారి బిఎన్ఎస్.ప్రసాద్, రిటైర్డ్ తహశీల్దార్ బి.ప్రసాద్, ఎపి బహుజన జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.రమేష్, కాంగ్రెస్ పార్టీ సిసిఎల్ జిల్లా అధ్యక్షులు కాకర రాజ్‌కుమార్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, రైతుసంఘం జిల్లా నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య ప్రసాద్, షేక్ వలీ, సిపిఐ జిల్లా నాయకులు సీతారాం ప్రసాద్ పాల్గొన్నారు.



భీమవరం నుంచి ప్రారంభమైన ర్యాలీ

యూరియా కొరతపై రైతుల నిరసన

ప్రజాశక్తి - భీమడోలు



నిరసన తెలుపుతున్న రైతులు, నేతలు

యూరియా కొరతపై పూళ్లలోని హైస్కూల్ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూరియా అందించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూరియాతో ఇచ్చే సబ్సిడీ తగ్గించుకోవడం కోసం యూరియా కొరత సృష్టించడం తగదన్నారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియాపై నేరుగా రైతులకు సబ్సిడీ ఇస్తామని, యూరియా వాడకం వల్ల రోగాలు వస్తున్నాయని ప్రచారం చేయడం తగదన్నారు. శాస్త్రీయత లేని నానో యూరియా రైతులకు అమ్మే ప్రయత్నాలు ఆపాలని కోరారు. ఇప్పటికైనా యూరియా కొరతపై నాటకాలు ఆపి రైతులకు అవసరమైన యూరియా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించాలి

నల్ల రిబ్బన్లతో సచివాలయ సిబ్బంది విధులకు హాజరు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



నల్ల రిబ్బన్లతో విధులకు హాజరైన సచివాలయ సిబ్బంది



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు నల్ల రిబ్బన్లతో విధులకు హాజరయ్యారు. వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల ఎనిమిదో తేదీన సమ్మె నోటీసు అందించారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దశల వారీగా నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల వ్యాప్తంగా పలు సచివాలయాల్లో సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరైనట్లు మండల సచివాలయ ఉద్యోగులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ జెఎసి పిలుపు మేరకు 23 నుంచి 25వ తేదీ వరకు నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరవుతామని, మధ్యాహ్న భోజన విరామంలో కార్యాలయాల ముందు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలియజేస్తామని చెప్పారు. ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై విచారణ

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పిజిఆర్ఎస్ ద్వారా ఆ వ్యక్తులకు లబ్ధి చేకూరాలని నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న తెలిపారు. తహశీల్దార్ డి.ప్రశాంతి, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలోని గోపవరంలో ఓ వృద్ధ అర్జీ పెట్టగా విచారణ చేపట్టి పరిష్కరించేందుకు వచ్చారు. తన పొలంలోకి గ్రామంలోని మురుగునీరు ఎక్కువగా వస్తుందని, దీంతో పంట పాడైపోతుందని కాట్రేనిపాడుకు చెందిన ఓ రైతు అర్జీ చేసుకున్నారు. సబ కలెక్టర్ పరిశీలించి విచారణ చేపట్టారు.

అసిస్టెంట్ కమిషనర్గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



ఏలూరు నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్గా డి.శ్రీనివాసరావును నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గతంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డిప్యూటీ కమిషనర్గా పనిచేశారు. ఉద్యోగోన్నతిపై ఏలూరు నగరపాలక సంస్థకు అసిస్టెంట్ కమిషనర్గా నియమితులయ్యారు.

పిహెచ్సి 30 పడకల ఆసుపత్రిగా అప్గ్రేడ్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు ప్రత్యేక కృషితో ద్వారకాతిరుమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆధునిక వసతులతో రూ.30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్గా అప్గ్రేడ్ అయిందని టిడిపి నాయకులు తెలిపారు. దీనిలో భాగంగా త్వరలో నిర్మించనున్న సిహెచ్సి భవనానికి తహశీల్దార్ జెవి.సుబ్బారావు, కూటమి నాయకులు కలిసి స్థలం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా సత్యనారాయణ, ద్వారకాతిరుమల సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావు, ఎఎంసి వైస్ ఛైర్మన్ పోతన ధర్మరాజు, జెడ్పిటిసి సభ్యులు శామ్యూల్, మాజీ ఎంపిపి, జెడ్పిటిసి మాజీ సభ్యులు ఏపూరి దాలయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్, ప్రభుత్వాసుపత్రి వైద్యులు ప్రవీణ్కుమార్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వర్జీనియా ధరలపై రైతుల హర్షం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వర్జీనియా పొగాకు ధరలు రైతులకు సంతోషాన్ని కలగజేస్తున్నాయని కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది తెలిపారు. పొగాకు వేలం కేంద్రంలో రైతు ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. దాదాపు 70 ఏళ్ల వర్జీనియా చరిత్రలో 430 గ్రేడెడ్ ధర పలికి ఆల్ టైం రికార్డ్ సృష్టించిందన్నారు. ప్రస్తుత సీజన్లో రూ.209తో ప్రారంభమైన కేజీ పొగాకు ధర రూ.430 చేరడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. వర్జీనియా టుబాకో బోర్డు తీసుకున్న ప్రత్యేక చర్యల వల్ల ఆశాజనకమైన ధర లభించిందన్నారు. బ్రెజిల్, జింబాబ్వే తదితర వర్జీనియా పండిస్తున్న దేశాల్లో కాంట్రాక్ట్ ఫార్మింగ్ విధానం వల్ల అక్కడి రైతాంగం దెబ్బతినగా, మనదేశంలో అమలు చేస్తున్న ఆక్షన్ విధానం కలిసొచ్చిందన్నారు. ఆక్షన్ మరో వారం పది రోజుల్లో ముగిస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, వచ్చే సీజన్లో రేటులు పెంచుకోవాలనే ఆనువుగా ఉంటుందన్నారు. రైతు ప్రతినిధులు ముప్పనేని వెంకటేశ్వరరావు, మద్దుపోయిన శ్రీను, దగ్గు సత్తిబాబు, ఆడపా సత్తిబాబు, దుగ్గిరాల బోసు, యాగంటి సుధాకర్, రావివారపు, గద్దె సురేష్, తోటకూర శ్రీనివాస్, పల్లి గణపతి, పారేపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు ఉద్యమించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మహాత్మ జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 153వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను ఖండిస్తూ సభలు, సమావేశాలు, సహపంక్తి భోజనాలు నిర్వహించాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపు వరకు మంగళవారం బోసుబొమ్మ సెంటర్లో ఐఎఫ్టియు డివిజన్ ప్రధాన కార్యదర్శి మండిలి రాజు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.రమణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొత్తూరి గంగరాజు, దిర్శిపాము చినదుర్గయ్య, కొత్తూరి నాగయ్య, కొత్తూరి శ్రీను, కంకిపాటి రాంబాబు పాల్గొన్నారు.

ఆయుర్వేద మొక్కల పెంపకంతో గృహవైద్యం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆయుర్వేద మొక్కల పెంపకం ద్వారా గృహవైద్యంతో పాటు మానవ ఆయుష్షాలం పెరుగుతుందని తహశీల్దార్ పివిఎస్.ప్రసాద్ అన్నారు. ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మంగళవారం గ్యాస్ సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కె.పాల్రమేష్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం, పోలీస్స్టేషన్, ఆయుర్వేద ఆసుపత్రుల్లో ఆయుర్వేద మొక్కలు నాటారు. తహశీల్దార్ పివిఎస్.ప్రసాద్కు, ఎస్ఐ శుభశేఖర్, ఆయుర్వేద వైద్యుడు తవిటి నాయక్కు పాల్ రమేష్ ఆయుర్వేద మొక్కలను అందించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్గా నాగు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్గా కన్నాపురం గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది మోడేపల్లి నాగు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మోడేపల్లి నాగు మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వ బ్రాహ్మణుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.

డ్రెయినేజీలో పూడిక తొలగింపు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్తపట్టిసీమలో కచ్చా డ్రెయినేజీ పూడిక తొలగింపు పనులను పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి మంగళవారం పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో డ్రెయినేజీ పూడిక తొలగింపు పనుల ద్వారా దుర్వాసనలు, మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమల నుంచి వచ్చే వ్యాధుల తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మైగాపుల విజయదుర్గ, పంచాయతీ కార్యదర్శి కోట ప్రసాద్, వైఎస్ సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం హెల్మెట్ల పంపిణీ

ప్రజాశక్తి - పోలవరం

రోడ్డు ప్రమాదంలో మరణించిన యడ్లగూడెం గ్రామానికి చెందిన అక్కులబత్తుల లక్ష్మణరావు జ్ఞాపకార్థం పోలవరంలో ఆయన స్నేహితుడు సర్పంచి కుమారుడు పోడూరు శ్యామ్కుమార్ పోలవరం సిఐ ఆధ్వర్యంలో హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్పై ప్రయాణించే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రాణం కంటే విలువైనది మరొకటి లేదని చెప్పారు. రోడ్డు నియమాలను పాటిస్తే ప్రాణాలను రక్షించుకోవచ్చన్నారు. హెల్మెట్ ధరించకపోవడంతో చాలా మంది రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని సిఐ బాల సురేష్ అన్నారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

భయభ్రాంతులకు గురి చేసి... బంగారం కాజేసి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధ దంపతులను ముగ్గురు దుండగులు భయభ్రాంతులకు గురి చేసి రూ.ఎనిమిది లక్షల విలువైన బంగారం అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లక్కవరానికి చెందిన వందనపు రుక్మయ్య లక్ష్మీకుమారి వృద్ధ దంపతులు సోమవారం రాత్రి ఇంట్లో నిద్రించారు. ఈ క్రమంలో సుమారు రెండు గంటల సమయంలో ముగ్గురు దుండగులు ఇంట్లోకి చొరబడి వారిని చంపుతామని బెదిరించి భయభ్రాంతులకు గురి చేసి లక్ష్మీకుమారి ఒంటిపై ఉన్న సుమారు రూ.ఎనిమిది లక్షల విలువైన బంగారాన్ని అపహరించుకుపోయారు. వృద్ధ దంపతులు ఈ విషయాన్ని వెంటనే లక్కవరం పోలీసులకు తెలిపారు. లక్కవరం ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంగళవారం ఉదయం జంగారెడ్డిగూడెం డిఎస్పి రవిచంద్ర ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు. ఏలూరు నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ను రప్పించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్పి తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

సమాజంలో విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో జీవించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. బధిరుల సంకేత భాషా దినోత్సవ వేడుకలు కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేక్ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భాష ఏదైనా భావ వ్యక్తీకరణ ప్రధానమన్నారు. ప్రపంచంలో ఎన్ని భాషలు ఉన్నప్పటికీ విశ్వవ్యాప్తంగా బధిరులందరికీ చేతి సౌంజ్ఞలతో (సైగలతో) కూడిన భాష, భావ వ్యక్తీకరణ ఉండడం చాలా గొప్ప విషయమన్నారు. బధిరుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు, ప్రభుత్వం సంక్షేమ పథకాలు నూరు శాతం అమలు చేస్తుందన్నారు. బాధితులకు ఉచితంగా స్మార్ట్ ఫోన్లు అందిస్తున్నారన్నారు. సమాజంలో విభిన్న ప్రతిభావంతులు, ఉత్తమ జీవన ప్రమాణాలతో జీవించేందుకు ఎన్నో పథకాలను అమలు చేస్తుందని, వాటిపై వారికి అవగాహన కల్పించి అర్హులందరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బధిరులకు కూడా ప్రభుత్వం వారి సంక్షేమం కోసం అమలు చేసే పథకాలపై వారికి అర్థమయ్యే రీతిలో తెలియజేయాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ సందేశాన్ని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఒకరు సభలో ఉన్న బధిరులకు అర్థమయ్యే సౌంజ్ఞలతో (సైగలతో) తెలిపారు. ఈ సందర్భంగా అర్హులైన బాధితులకు స్మార్ట్ ఫోన్లను కలెక్టర్ కె.వెట్రిసెల్వి అందించారు. బధిరుల సంక్షేమానికి విశేష సేవలు చేసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను దుశ్శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఒ శ్రీహరి, డిఆర్డిఎ పీడీ విజయరాజు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్కుమార్, సెట్వెల్ సిఇఒ ప్రభాకర్, విభిన్నప్రతిభావంతుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రభుత్వాల విధానాలతోనే వ్యవసాయ సంక్షోభం

స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు ప్రకటించాలి
రైతు సంఘం మండల మహాసభలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

ప్రజాశక్తి - భీమడోలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల నేడు వ్యవసాయం సంక్షోభంలో ఉందని, కష్టపడి పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు అందడం లేదని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పూళ్లలోని కాలువ గట్టు శివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల మహాసభ ఆ సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు అందకపోవడం అన్యాయమని విమర్శించారు. పంటల ధరల స్థిరీకరణ పథకం అమలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు సమస్యలు ముందస్తుగా పరిష్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు. నూతన కౌలు రైతుల చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలని కోరారు. కౌలు రైతుల సంఘం జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, సిఐటియు మండల నాయకులు బెండు శ్రీనివాస్, పలువురు రైతులు మాట్లాడారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

రైతు సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక

రైతు సంఘం భీమడోలు మండలాధ్యక్షులుగా సనపల వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా గురజాల కృష్ణబాలాజీ, ఉపాధ్యక్షులుగా గొడవర్తి రామారావు, సహాయ కార్యదర్శిగా మడపాని సత్యనారాయణ మరో ఏడుగురుతో నూతన కమిటీ ఏర్పడింది.



వెంకటేశ్వరరావు



కృష్ణబాలాజీ

ఎల్ఒసి పత్రం అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

పేదలకు నాణ్యమైన వైద్యం కోసం ప్రభుత్వం రూ.వేల కోట్లు కేటాయించిందని, డబ్బులు లేక మెరుగైన వైద్యానికి నోచుకోక అపత్కాలంలో ఉన్న నిరు పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సిఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండలంలో కాట్రేనిపాడు గ్రామానికి చెందిన జి.యేసయ్య కుటుంబానికి రూ.3.50 లక్షల ఎల్ఒసి పత్రాన్ని అందించారుర. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.

దాకారపు కృష్ణకు సన్మానం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సేవా రంగంలో రాజ్ న్యూస్ సేవా పురస్కారం అందుకున్న రోటరీ పూర్వ అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణను డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగా మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి నిస్వార్థంగా సమాజ సేవ కొనసాగిస్తున్న దాకారపు కృష్ణకు సేవా పురస్కారం మరింత గౌరవాన్ని పెంచిందన్నారు. డాంగేనగర్ పరిసరాల్లో పేదలకు గతంలో విష జ్వరాలు రాకుండా టైఫాయిడ్ వ్యాక్సిన్లు ఏర్పాటు చేయడం, రోడ్డు ప్రమాదానికి గురైన బాలికకు శస్త్రచికిత్స చేయించడంలో చొరవ చూపడం వంటి అనేక కార్యక్రమాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకర రావు, అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మణరావు, పఠాన్ బాజీ, ఉపాధ్యక్షులు లింగంకుంట శ్రీనివాస్, దావీదు పాల్గొన్నారు.

వెలుగు సిబ్బంది ర్యాలీ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

రాష్ట్ర సెర్ప్ డిపార్ట్మెంట్ (వెలుగు) వారి ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల అభివృద్ధి, వారికి సంబంధించిన, జమ ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు ప్రతి డ్వాక్రా సభ్యురాలికి తెలిసే విధంగా నూతనంగా ఏర్పాటుచేసిన మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమం ద్వారకాతిరుమల మండల పరిషత్ ఆవరణలో నిర్వహించారు. వెలుగు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ లంక సత్యనారాయణ, ద్వారకాతిరుమల సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావు, ఎఎంసి వైస్ ఛైర్మన్ పోతన ధర్మరాజు, తహశీల్దార్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం రాజీవ్ నగర్కు చెందిన మద్రిపూడి సూర్యప్రకాష్ కొంతకాలం నుంచి పెరాలసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి వైద్య ఖర్చుల నిమిత్తం టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, బూరుగుపల్లి సూరిబాబు చేతులమీదగా రూ.20 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ఈర్ని సూరిబాబు, యడ్లపల్లి ఏడుకొండలు, రావిపాటి సుబ్బారావు, దాసురోజు సక్కు, కొత్తూరి సత్తిబాబు, దేరంగుల వెంకట్, తమ్మా నాగేశ్వరరావు, చిక్కాల సత్యనారాయణ, చిత్రాడ శ్రీను, కాగితాల రాంబాబు, నూతంగి ప్రసాద్, తాపీ మేస్త్రి భాషా పాల్గొన్నారు.

సమస్యలకు భయపడొద్దు : డిఎస్పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ఉండాలని ఏలూరు డిఎస్పి డి.శ్రావణకుమార్ విద్యార్థినులకు సూచించారు. డిఎస్పి పర్యవేక్షణలో శక్తిటీమ్ సభ్యులు ఏలూరు అమీనాపేట సాంఘిక సంక్షేమ మహిళా వసతి గృహాలకు వెళ్లే మార్గంలో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి విద్యార్థినులతో మాట్లాడి వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సమయంలో పోలీస్ సహాయాన్ని పొందడానికి 112 డయల్ చేయాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేకంగా 181 హెల్ప్లైన్ను ఏర్పాటు చేశారని తెలిపారు. శక్తియాప్ నెంబర్ 7993485111 మహిళల భద్రత కోసం ఏర్పాటు చేశారని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఎస్ఐ నాగమణి, శక్తి టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

విఆర్ఒలకు ప్రమోషన్లు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులు అర్హులైన గ్రేడ్-1 విఆర్ఒలతో భర్తీ చేయాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ వెట్రిసెల్విని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో కలిసి వినపత్రం అందించారు. ఈ సందర్భంగా భూపతిరాజు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-1 విఆర్ఒలకు సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లు రెండేళ్ల నుంచి ఇవ్వకపోవడంతో వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

8 గంటల పని విధానం రద్దుపై ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ రోజుకు 12 గంటలు పని చేయించుకోవచ్చని అసెంబ్లీలో సెప్టెంబర్ 19న తీర్మానం చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం ఐఎఫ్టియు అనుబంధ వంగూరు గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ఫ్యాక్టరీ వద్ద భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. పని గంటలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఐఎఫ్టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు(యువి), జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడారు. ఎనిమిది గంటల పని విధానానికి తూట్లు పొడిచే విధంగా కూటమి ప్రభుత్వం నిర్ణయం చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది కార్మికుల హక్కులను హరించడమేనన్నారు. కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన ఈ చట్ట సవరణను వెంటనే రద్దు చేయాలని, లేకుంటే భవిష్యత్తులో కార్మిక వర్గం ఆగ్రహాన్ని ఈ ప్రభుత్వాలు చవిచూడక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు బెజవాడ పద్మ, కార్యదర్శి ఎం.రంగమ్మ, కమిటీ సభ్యులు ఎ.ఆలీసమ్మ, ఎస్.బేబి, రాణి తదితరులు నాయకత్వం వహించారు.

కుల ధ్రువీకరణ పత్రాలు కోరుతూ వంటావార్పు

ప్రజాశక్తి - చింతలపూడి, కామవరపుకోట

ఎస్టి నాయక కులస్తులకు సర్టిఫికెట్స్ ఇవ్వాలని కొమరం భీమ్ కులస్తుల సంఘం ప్రెసిడెంట్ రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొమరం భీం నాయక కులస్తుల సంఘం ఆధ్వర్యంలో కామవరపుకోట తహశీల్దార్ కార్యాలయం వద్ద వంటావార్పుతో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మండలం కేంద్రంలో కొండగూడెం గ్రామం శివారు, నాయకులగూడెంలో ఉంటున్న నాయక సామాజిక తరగతుల వారికి కుల సర్టిఫికెట్ లేకపోవటంతో పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎస్టి సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ మధుబాబు, ట్రెజరర్ నరసింహారావు, టివిఎస్.రాజు, మేనుగుల దుర్గారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటలను ఇ-క్రాప్లో నమోదు చేయించుకోవాలి

ఆగిరిపల్లి :రైతులందరూ తాము పండించే పంటలను తప్పనిసరిగా ఇ-క్రాప్లో నమోదు చేయించుకుని ప్రభుత్వం కల్పించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఆగిరిపల్లి మండల వ్యవసాయాధికారి జె.భవాని అన్నారు. ఆగిరిపల్లి వ్యవసాయ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు పంటకోత ప్రయోగంపై మండల సహాయ గణాంక అధికారి ఎఎస్ఆర్ సుబ్రహ్మణ్యం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మండల ఉద్యాన అధికారి కె.జ్యోతి ప్రియాంక, వ్యవసాయ విస్తరణాధికారి కె.ధనబాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ముసునూరు

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యకరంగా ఉంటాయని మండల వ్యవసాఅవధికారి అక్కినేని చాముండేశ్వరి చెప్పారు. మండలంలోని ముసునూరు, చింతలవల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు, పకృతి, సేంద్రియ వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



ఆగిరిపల్లిలో..

మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉండటంతో పాటు, ఆరోగ్యకర సమాజం తయారవుతుందని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి జె.జగన్మోహన్రావు అన్నారు. స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని అడవినెక్కలం గ్రామ సచివాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వేము రాజు, పంచాయితీ కార్యదర్శి కె.లక్ష్మి, గ్రామ ప్రముఖులు మాదల జనార్ధనరావు, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టి.నరసాపురం : గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాలతో అనారోగ్య బాధితులకు మేలు చేకూరుతుందని జెడ్పిటిసి మాజీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు అన్నారు. మండలంలోని రాజుపోతేపల్లి సబ్ హెల్త్ సెంటర్ పరిధిలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో మండల వైద్యాధికారి జె.కల్పనారాణి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దావులూరి సూర్యనారాయణ, ముసునూరి బాలస్వామి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎస్.విజయరామరాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టెండర్ ప్రకటన

Proc.No:19/SA/Admin/DVAP/2025 **Dated:16-09-2025**

of the Collector and District Magistrate, Eluru District, Eluru వారి ఉత్తర్వుల ప్రకారం Nuzvid Consistency, Vision 2047 Team కి ఈ క్రింద తెలిపిన ఐటమ్స్కి కొటేషన్లు కోరడమైనది. కొటేషన్లు ది. 17-09-2025 వ తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయం, నూజివీడు నందు సమర్పించవల్సినదిగా కోరుచున్నాము.

Sl.No.	Description	No. of Items
Computers & Related Items		
1	Desktops (intel I5 14th gen / 8gb Ram / 512gbSSD/20” Led Monitor/Windows 11/Wire keyboard and Mouse	5
2	Laptop (Note Book i5 ultra 5/16gb ram /1tb ssd/windows 11/15.6” screen/msoffice/silver	1
3	Printer cum Scanner (HP/Canon) All in one with scanner, copier, Fax, Auto feeder	1
4	IKV Microtcach UPS	5
Office Furniture		
1	Executive Chair & Table for Hon’ble MLA	1
2	Executive Chair & Table for Spl. Officer	1
3	Air Conditioner	2
4	Desk Based Office Cubical - 5x5	6
5	Staff Chairs	6
6	Visitor Chairs	10
7	Stationery, Internet, Room Partitions & Other expenses	

పి-4 సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పి-4 విధానం అమలు కోసం ఉద్యోగ సిబ్బంది అందరూ కలిసి ముందుకు నడవాలని ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పి-4 సర్వేపై గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా బంగారు కుటుంబాల గుర్తింపు పారదర్శకంగా నిర్వహించి ఆ కుటుంబాలను జిఎస్డబ్ల్యుఎస్ యాప్లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి కుటుంబంతో పరిచయం కలిగి వారి అవసరాలను తెలుసుకోవాలని చెప్పారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 934 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ రంగంలో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - పోలవరం

విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు వృత్తి విద్య కోర్సుల పట్ల అవగాహన కలిగి ఉండాలని వృత్తి విద్యా ఉపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న విద్యార్థులకు సూచించారు. మండలంలోని గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జూరెడ్డి చంద్రశేఖర్, స్కూల్ అసిస్టెంట్ కోరాడ రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఇంటర్న్షిప్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ వృత్తి విద్యా కోర్సులను అభ్యసించడం ద్వారా అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. ఈ రంగాల్లో ఆర్థిక అభివృద్ధి సాధించడానికి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం కాకుండా ఆర్థికంగా నిలతొక్కుకోవడానికి వృత్తి విద్యా కోర్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

వృక్షాలకు నేడు బహిరంగ వేలం

ఏలూరు :నూజివీడులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గుర్తించిన స్థలంలో రూ.25 లక్షలకు పైగా విలువైన వృక్షాలకు ఈ నెల 24వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు స్థలంలో 52 టేకు వృక్షాలు, 82 కొబ్బరి చెట్లు, ఐదు వేప చెట్లు ఉన్నాయని, ఆసక్తి ఉన్న వ్యక్తులు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వేలానికి సంబంధించిన వివరాలు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారని, కార్యాలయంలో అడిగి తెలుసుకోవచ్చని సబ్ కలెక్టర్ తెలిపారు.

మహారాజశ్రీ 3వ ఎడిషనల్ సివిల్ కోర్టు, ఏలూరు, ఏలూరు జిల్లా.

ఓ.ఎస్.నెం. 110 /2025

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంచ్ మేనేజర్, గోపన్నపాలెం ...వాది

బిట్వీన్

నిడమనూరి రామకృష్ణ s/o సుబ్బారావు
ముందూరు, పెదవేగి మండలం,
ఏలూరు జిల్లా.

...ప్రతివాది

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా పై తెలిపిన కోర్టులో ది.**06-10-2025**వ తేదీన వాయిదా కలదు. ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేనియెడల కోర్టు వారు పరోక్షంగా, తీర్మానం చేయగలరని తెలియజేయుచున్నాము.

కొండేటి శ్రీనివాసరావు, అడ్వకేట్,
స్థలం: ఏలూరు పానుగంటి వారి వీధి, ఏలూరు.
తేది.**23-09-2025** సెల్: 9441276324

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)వారి కోర్టులో,

I.P.No. 4/2024

Between:

మగటం సతీష్ బాబు ...పిటీషనర్

మరియు

దాసరి వెంకట రమణ వగైరా ...Respondants

1. **ఆరుమిల్లి శిరీష,** D/o. సాయిబాబు, D.No. 5-52, వీరభద్రస్వామి గుడి దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2. **ఆరుమిల్లి సుధీర్ కుమార్,** S/o. సాయిబాబు, D.No. 5-51, వీరభద్రస్వామి గుడి దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3. **వాడపల్లి రాంగోపాల కృష్ణ,** S/o. హనుమంతాచార్యులు, D.No. 3-91, వైష్ణాలయం గుడి దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
4. **వాడపల్లి సీతామహాలక్ష్మి,** W/o. రాంగోపాల కృష్ణ, D.No. 3-91, వైష్ణాలయం గుడి దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
5. **గారపాటి స్వాతి,** W/o. సత్యనారాయణ, SBI ఎదురుగా, చించినాడ రోడ్డు, D.No. 1-101, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
6. **భాగవతులు లక్ష్మీ నరసింహం,** S/o. చిన్న లక్ష్మి నరసింహం, D.No. 2-108, శివాలయం దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
7. **ఉండవల్లి అనంతలక్ష్మి,** S/o. నాగభూషణం, D.No. 4-40, వైష్ణాలయం దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
8. **దామిశెట్టి సత్యనారాయణ,** S/o. ప్రసాదరావు, D.No. 2-57, వైష్ణాలయం దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.

మీ పై, పై పిటీషనర్ పై కోర్టులో తనని Insolvent గా ప్రకటించమని కోరుచు మీ పై, పై నెంబర్ పిటీషన్ దాఖలు చేసినందున సదరు దావాలో Respondents 6 to 10 మరియు 12 to 14 వ Respondents నకు పలుమార్లు కోర్ట్ ద్వారా నోటీసులు పంపించినను, ఉదేశ్యపూర్వకంగా త్రిప్పి పంపించి వేసినందున శ్రీ పై కోర్ట్ వారి ఎదుట హాజరవుటకు శ్రీ పై కోర్ట్ వారు Respondents అయిన మీ యొక్క హాజరు నిమిత్తం పత్రికలో దిన ప్రకటన చేయవలసినదిగా ఆర్డర్ జారి చేసినారు. సదరు ఆర్డర్ ప్రకారం సదరు పిటీషను **ది. 07-10-2025** తేదికి వాయిదా అయి వున్నది. కాబట్టి మీరు స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని పై కోర్ట్ వారి ఎదుట **ఉదయం గం. 10:30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు తెలియ చేసుకొనవలెను. లేని యడల మీ పరోక్షమున పై పిటీషను తీర్మానం చేయబడును

రామారావు పొన్నమండ B.A.B.L.
Advocate,
నర్సాపురం Narasapuram
ది.23-09-2025